# నవతరం పరిశోధనలు - 16

## కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార కథాసంపుటాలు: పరిశీలన (2011-2020)



**సిరిబోయిన శివశంకర్ రావు**, తెలుగు & ప్రాచ్యభాషావిభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.
సెల్ : 9177170901. మెయిల్ : siriboinajyo@gmail.com
**కోర్సు:** Ph.D. **రీసెర్చ్ ఏరియా:** కథా సాహిత్యం
**పర్యవేక్షకులు:** ఆచార్య నారిశెట్టి వెంకట కృష్ణారావు. **పరిశోధన కాలం:** 2021 నుండి 2026

గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చెందిన సిరిబోయిన శివశంకర్ రావు, ఆచార్య నారిశెట్టి వెంకటకృష్ణారావు గారి పర్యవేక్షణలో "కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార కథా సంపుటాలు – పరిశీలన (2011–2020)" అనే అంశంపై పిహెచ్.డి. పరిశోధన చేస్తున్నారు. కథాసాహిత్యంపై ఆసక్తితో పాటు విమర్శనాత్మక దృష్టితో విషయాలను పరిశీలించే స్వభావం తనకు కుటుంబం నుంచే వచ్చినదని ఆయన తెలిపారు. ముఖ్యంగా తన తల్లి సరస్వతి గారి ఆలోచనా విధానం తనలో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించిందని పేర్కొన్నారు. వేంపల్లి షరీఫ్ గారి జుమ్మా కథా సంపుటిలోని "దస్తగిరి చెట్టు" కథను చదివిన తర్వాత ఈ కథలపై లోతైన అధ్యయనం చేయాలనే ఆసక్తి కలిగిందని, ఆ విషయాన్ని పర్యవేక్షకులతో చర్చించిన తరువాత ఈ అంశాన్ని పరిశోధనకు ఎంపిక చేసుకున్నట్లు వివరించారు. పరిశోధన ఉద్దేశ్యాన్ని వివరిస్తూ, తెలుగు సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కారం పొందిన కథా సంపుటాలలో అంతర్లీనంగా ఉన్న సాహిత్య విలువలను విశ్లేషించాలనే సంకల్పంతో ఈ అధ్యయనం కొనసాగుతోందని ఆయన తెలిపారు. యువ రచయితల కథల్లో వ్యక్తమయ్యే సామాజిక స్పృహ, మానవ సంబంధాలు, సమకాలీన సమస్యలు, భావవ్యక్తీకరణ వంటి అంశాలను సమగ్రంగా అధ్యయనం చేయడం ఈ పరిశోధన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కథలను విస్తృతంగా పాఠకలోకానికి చేరువ చేసి తద్వారా నేటి యువతరాన్ని సాహిత్యం వైపు మళ్లించాలనే అభిలాష కూడా ఈ పరిశోధన వెనుక ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ పరిశోధనలో 2011 నుండి 2020 మధ్యకాలంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కారం పొందిన ఐదు కథా సంపుటాలను పరిశీలనలోకి తీసుకుంటున్నారు. మొలకల పున్నమి, జుమ్మా, అవుట్ ఆఫ్ కవరేజ్ ఏరియా, చిట్టగాంగ్ విప్లవ వనితలు, మిళింద వంటి గ్రంథాలను సేకరించడంలో రచయితలను ప్రత్యక్షంగా సంప్రదించాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. కొన్ని పుస్తకాలను రచయితల సహకారంతో, మరికొన్నింటిని ప్రచురణకర్తల ద్వారా సేకరించగా, రచయితల సాహిత్య ప్రయాణం, వ్యక్తిగత వివరాలు, విమర్శావ్యాసాలను సేకరించడంలో కొన్ని ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు చెప్పారు. అయినప్పటికీ అందుబాటులో ఉన్న ముద్రిత, డిజిటల్ ఆధారాలను సమన్వయం చేసుకొని విశ్లేషణాత్మక పద్ధతిలో ఈ పరిశోధనను కొనసాగిస్తున్నట్లు వివరించారు.

ఈ సిద్ధాంత గ్రంథాన్ని పరిశోధకుడు ఆరు అధ్యాయాలుగా విభజించారు. మొదటి అధ్యాయంలో కేంద్ర సాహిత్య అకాడమీ ఆవిర్భావం, యువపురస్కార నేపథ్యాన్ని వివరించగా, రెండవ అధ్యాయంలో యువపురస్కారం పొందిన రచయితల పరిచయాన్ని అందించారు. తదుపరి అధ్యాయాలలో కథల వర్గీకరణ, ఇతివృత్తపరిచయం, పాత్రచిత్రణ, శైలివిన్యాసం, సామాజికదృక్పథం వంటి అంశాలను విశ్లేషణాత్మకంగా పరిశీలిస్తున్నారు. సాహిత్య పరిశోధన అనేది కేవలం విద్యార్హత కోసం కాకుండా సాహిత్య సంపదను విస్తరించే దిశగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు.

**- సంపత్ కుమార్ బానోజి**

# నవతరం పరిశోధనలు - 17

## అమ్ముల సాంబశివరావు ఆధ్యాత్మికరచనలు - భారతీయతత్త్వజ్ఞానవివేచన



**బడే సి.ఎస్.వి. ప్రసాద్,** తెలుగు & అనువాద శాఖ , ద్రావిడ యూనివర్సిటీ, కుప్పం, చిత్తూరు.
**సెల్:** 9492525018. **మెయిల్:** bcsvprasad@gmail.com
**కోర్సు:** Ph.D. **రీసెర్చ్ ఏరియా:** ఆధ్యాత్మిక సాహిత్యం
**పర్యవేక్షకులు:** డా. వి. పళని. **పరిశోధనకాలం:** 2023 నుండి 2029

ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పంలోని తెలుగు & అనువాదశాఖకు చెందిన బడే సి.ఎస్.వి. ప్రసాద్ (బడే చంద్రశేఖర వర ప్రసాద్), డా. వి. పళని గారి పర్యవేక్షణలో అమ్ముల సాంబశివరావు ఆధ్యాత్మిక రచనలు - భారతీయ తత్త్వ జ్ఞాన వివేచన అనే అంశం పై పిహెచ్.డి. పరిశోధన చేస్తున్నారు. మానవశక్తికి దైవశక్తి ఏ విధంగా తోడ్పడుతుందనే ఆలోచన పరిశోధకునిలో ఈ అంశంపై ఆసక్తిని కలిగించిందని ఆయన తెలిపారు. ఆధ్యాత్మిక సాహిత్యంలో వ్యక్తమయ్యే దైవచింతనను లోతుగా అధ్యయనం చేయాలనే అభిరుచి ఈ పరిశోధనకు ప్రేరణగా నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ పరిశోధన ఉద్దేశ్యాన్ని వివరిస్తూ, ఆధ్యాత్మికత అవసరం ఏమిటి, మానవ జీవితంలో గురువు పాత్ర ఎంతవరకు ప్రాధాన్యాన్ని కలిగి ఉంది అనే అంశాలను సాహిత్య దృష్టితో విశ్లేషించాలనే సంకల్పంతో ఈ అధ్యయనం కొనసాగుతోందని ఆయన తెలిపారు.

వ్యక్తి అంతర్ముఖవికాసంలో ఆధ్యాత్మికత స్థానం, ఆ మార్గంలో గురువు మార్గనిర్దేశకత్వం, జీవన విలువల రూపకల్పనలో గురుసంప్రదాయ పాత్ర వంటి అంశాలను పరిశీలించడం ఈ పరిశోధన ప్రధాన లక్ష్యంగా ఉందని వివరించారు. ఈ పరిశోధనలో నాటి దత్తాత్రేయుడి నుండి నేటి షిరిడి సాయిబాబా వరకు కొనసాగిన గురు సంప్రదాయాలను పరిశీలనలోకి తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా నాథ, దత్త సంప్రదాయాలతో పాటు సనాతన భారతీయ తాత్త్విక చింతనకు మూలాలైన ఉపనిషత్తులను, షడ్దర్శనాలను అధ్యయనం చేసి ఆ సారాన్ని నేటి కాలానికి అనుగుణంగా అందించదలచుకున్నట్లు తెలియజేశారు. ఇక ఈ ఆధ్యాత్మిక సాహిత్యంలో అమ్ముల సాంబశివరావు గారి తత్త్వ జ్ఞాన వివేచనను ప్రధానంగా పరిశీలిస్తూ గురుపరంపర, తాత్త్వికత, మానవ జీవనదృక్పథం మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషిస్తున్నారు. ఇందుకు సంబంధించిన గ్రంథాలు, తాత్త్విక మూలాలు, ఆధ్యాత్మిక రచనలను సేకరించి విశ్లేషణాత్మక పద్ధతిలో ఈ పరిశోధనను కొనసాగిస్తున్నారు.

ఈ సిద్ధాంత గ్రంథాన్ని పరిశోధకుడు ఆరు అధ్యాయాలుగా విభజించారు. మొదటి అధ్యాయంలో సనాతన భారతీయ తాత్త్విక చింతనను పరిచయం చేయగా, రెండవ అధ్యాయంలో సనాతనభారతీయతత్త్వంలో గురుసంప్రదాయాలను పరిశీలించారు. మూడవ అధ్యాయంలో అమ్ముల సాంబశివరావు జీవనరేఖలను, నాల్గవ- ఐదవ అధ్యాయాలలో బోధామృతం, గురుహృదయం గ్రంథాలలో వ్యక్తమైన తత్త్వజ్ఞానవివేచనను, చివరి అధ్యాయంలో ఇతర రచనల ద్వారా వ్యక్తమైన తాత్త్వికభావాలను పరిశీలించనున్నారు. భావితరాల సర్వతోముఖాభివృద్ధికి ఇటువంటి పరిశోధనలు మార్గనిర్దేశకంగా నిలుస్తాయని భావించవచ్చు.

**- సంపత్ కుమార్ బానోజి**

# నవతరం పరిశోధనలు - 18



## బండి నారాయణ స్వామి నవలలు - విశ్లేషణ

**బుక్కే ధనక నాయక్**, తెలుగు & ప్రాచ్యభాషావిభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.
**సెల్:** 8187056010. **మెయిల్:** dhanakanaikbukke111@gmail.com
**కోర్సు:** Ph.D. **రీసెర్చ్ ఏరియా:** నవలాసాహిత్యం
**పర్యవేక్షకులు:** ఆచార్య నారిశెట్టి వెంకట కృష్ణారావు. **పరిశోధనకాలం:** 2022 నుండి 2026

రాయలసీమ ప్రాంతీయ జీవితం, అక్కడి భాషాస్వరూపం, సామాజికవాస్తవాలను సాహిత్యరూపంలో ఆవిష్కరించిన రచయితల్లో బండి నారాయణస్వామి ఒకరని బుక్కే ధనక నాయక్ పేర్కొన్నారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో ఆచార్య నారిశెట్టి వెంకటకృష్ణారావు గారి పర్యవేక్షణలో "బండి నారాయణ స్వామి నవలలు - విశ్లేషణ" అనే అంశంపై వీరు పరిశోధన కొనసాగిస్తున్నారు. తాను కూడా రాయలసీమ వాస్తవ్యుడవ్వడం చేత అక్కడి ప్రజల జీవన విధానం, ప్రాంతీయ భాష, సామాజిక సంఘర్షణలు బండి నారాయణ స్వామి నవలల్లో ఏ విధంగా ప్రతిఫలించాయో అధ్యయనం చేయాలనే ఆసక్తి తనలో కలిగిందని తెలిపారు. తెలుగు సాహిత్య చరిత్రలో సమాజ హితాన్ని దృష్టిలో ఉంచుకొని రచనలు చేసిన రచయితల్లో బండి నారాయణ స్వామి ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పరిశోధకుడు అభిప్రాయపడ్డారు. అణగారిన వర్గాల జీవన పోరాటం, సామాజిక అసమానతలు, ప్రాంతీయ చైతన్యం వంటి అంశాలు ఆయన నవలల్లో ప్రధానంగా ప్రతిఫలించాయని తెలిపారు. దళిత, బహుజన వర్గాల సమస్యలతో పాటు ఆధునిక సమాజంలో గుర్తింపు కోసం పోరాడుతున్న వర్గాల జీవన అనుభవాలను కూడా రచయిత తన నవలల్లో చిత్రించిన తీరు విశేషమని చెప్పారు. సమాజంలో కనిపించే అసమానతలను సాహిత్య రూపంలో నమోదు చేసిన రచయిత బండి నారాయణ స్వామి సాహిత్యాన్ని సమగ్రంగా అధ్యయనం చేయడం ఈ పరిశోధన ప్రధాన ఉద్దేశమని వివరించారు.

ఈ పరిశోధనలో గద్దలాడతండాయి, మీరాజ్యం మీరేలండి, రెండు కలల దేశం, శప్తభూమి, అర్ధనారి వంటి నవలలను పరిశీలనలోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ నవలల్లో రాయలసీమ ప్రాంతీయ జీవితం, సామాజిక మార్పులు, అణచివేతకు గురైన వర్గాల మనోవేదన, మానవసంబంధాల వైవిధ్యం వంటి అంశాలను విశ్లేషణాత్మకంగా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా ప్రాంతీయ భాష, పాత్రల నిర్మాణం, సామాజిక చైతన్యం, రచయిత దృక్పథం వంటి అంశాలను పరిశీలించడం ద్వారా బండి నారాయణస్వామి సాహిత్యదృక్పథాన్ని ఆవిష్కరించవచ్చని అభిప్రాయపడ్డారు. ఇందుకు అవసరమైన గ్రంథాలు, విమర్శావ్యాసాలు, సంబంధిత ఆధారాలను సేకరించి ఈ పరిశోధనను కొనసాగిస్తున్నట్లు తెలియజేశారు. వీరు తమ పరిశోధన సౌలభ్యం కోసం ఈ సిద్ధాంత గ్రంథాన్ని అయిదు అధ్యాయాలుగా విభజించారు. మొదటి అధ్యాయంలో బండి నారాయణస్వామి జీవనరేఖలను పరిచయం చేయగా, రెండవ అధ్యాయంలో తెలుగు నవల పరిణామ వికాసాన్ని వివరించారు. తదుపరి అధ్యాయాలలో బండి నారాయణ స్వామి నవలల ఇతివృత్తాలు, పాత్రల స్వభావచిత్రణ, సామాజికస్పృహ వంటి అంశాలను విశ్లేషణాత్మకంగా పరిశీలిస్తున్నారు. ప్రాంతీయసాహిత్యాన్ని సామాజికకోణంలో అధ్యయనం చేసే పరిశోధనలు భవిష్యత్‌లో తెలుగు నవలాసాహిత్యంపై మరిన్ని అధ్యయనాలకు ప్రేరణగా నిలుస్తాయి.

**- సంపత్ కుమార్ బానోజి**

**(మరికొన్ని పరిశోధనల పరిచయం వచ్చే సంచికలో...)**